క్లుప్తంగా

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న రవీందర్

సిరిసిల్లటౌన్: బీజేపీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పార్లమెంట్ కో కన్వీనర్ ఆడేపు రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అశోక్‌నగర్‌లో కౌన్సిలర్ గూడూరి భాస్కర్ అధ్యక్షతన స్ట్రీట్‌కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని, రాష్ట్రంలో 11వేల శక్తి కేంద్రాల్లో స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ చీరలతో ఉత్పత్తితో కార్మికునికి, ఉత్పత్తిదారునికి ఎలాంటి లాభం లేదని, బతుకమ్మ చీరలతో వస్త్రపరిశ్రమ కుంటుపడిందన్నారు. అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, గణేశ్, కోడం నవీన్, తడక విజయ్, రాజాసింగ్, ప్రతాప్, మోర శ్రీహరి, రామస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధితో మెరుగైన వైద్యం



చెక్కు అందిస్తున్న సర్పంచ్ లింగం

వీర్నపల్లి: ఆపద సమయంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నందగిరి లింగం అన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం లబ్ధిదారుడు వడ్లసాయికి రూ.60 వేలు అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ తాటిలింక ప్రభాకర్, రైతుకమిటీ మండల అధ్యక్షుడు రాయిని బుగ్గయ్య, నాయకులు దేవరాజు, మల్లయ్య, మోహన్ ఉన్నారు.

సచివాలయం డూమ్ కూలుస్తామనడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ అంబేడ్కర్ పేరుతో నిర్మించిన రాష్ట్ర సచివాలయం డూమ్ కూల్చివేస్తామనడం బీజేపీ నాయకులకే చెల్లిందని సెస్ డైరెక్టర్ కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని అధికారిక భవనాల డూమ్‌లను కూల్చే ధైర్యం బీజేపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. సచిలవాయ డూమ్‌లు పడగోడుతామనడం సిగ్గుచేటన్నారు. ప్రగతి భవన్ గోడలు బద్దలు కొడుతా అంటూ కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

రూ.లక్ష రుణమాఫీ చేయాలి

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రూ. లక్ష రుణమాఫీ చేయాలని, ఇప్పుడు రూ.90వేల వరకే మాఫీచేస్తామనడ సరికాదని బీజేపీ మండల ప్రధానకార్యదర్శి బత్తిని స్వామిపేర్కొన్నారు. రూ.లక్ష రుణమాఫీ చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు.


ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలంలోని బట్టోనితాళ్లలో శ్రీ మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కేతమ్మ, శివలింగం, ఆంజనేయస్వామి, గణపతి, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన యంత్ర ప్రతిష్ఠాపన చేశారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ మహేశ్, శ్రీకృష్ణయాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఊరు వాడ సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఇంటికో బోనంతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

యాసంగికి గోదావరి జలాలు

- అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం చెరువులోకి కాళేశ్వరం నీళ్లు
- 150 క్యూసెక్కులు విడుదల



రహీంఖాన్‌పేట ఫీడర్‌చానల్ కాలువ నుంచి వెళ్తున్న సాగునీరు

ఇల్లంతకుంట: నీళ్లులేక నోరెళ్లబెడుతున్న ఆ నేల కాళేశ్వరం గంగతో పులకించింది. అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం పెద్ద చెరువులోకి నాలుగు రోజుల క్రితం నీటిపారుదలశాఖ అధికారులు నీటిని విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కరువు చీకట్లను చేదిస్తూ కాళేశ్వరం జలాలు అనంతారం పెద్దచెరువులోకి చేరాయి. నెలరోజులుగా అనంతారం పెద్దచెరువులోకి నీళ్లు విడుదల చేయాలని వివిధ గ్రామల రైతులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ ఈఎన్‌సీతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. అనంతారం పెద్ద చెరువులోకి అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి విడుదల....

మరో 15 రోజుల్లో వరిపైరు పొట్టకొస్తుందని, నీళ్లులేక పొలాలు నెర్రెలు బారుతున్నాయని, పెట్టుబడి మట్టిపాలవుతుందని రైతులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు గోడు వెల్లబోసుకున్నారు. అయితే అనంతారం చెరువు పక్కనే కాళేశ్వరం అదనపు టీఎంసీ పైపులైన్ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయి. అనంతారం చెరువు పూర్తిస్థాయిలో నింపితే పనులకు అంతరాయం కలుగుతుందని నీటిపారుదలశాఖ అధికారులు ఎమ్మెల్యేకు సూచించడంతో వెంటనే ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నీటిపారుదలశాఖ ఈఎన్‌సీతో మాట్లాడి అనంతారం చెరువు మత్తడికి రెండుమీటర్ల మేర గండిపెట్టించి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా డీ1 కాలువ మీదుగా నీటిని విడుదల చేయించారు. ఎమ్మెల్యే చొరవతో నీటిపారుదలశాఖ అధికారులు మత్తడికి గండిపెట్టడంతో అటు పైపులైన్ పనులు సాగుతుండడంతో పాటు మరోవైపు రైతులకు పంటలు ఎండిపోకుండా బిక్కవాగులోకి నీళ్లు విడుదల చేశారు.

15 గ్రామాలకు మేలు....

అనంతారం పెద్ద చెరువు ద్వారా కాళేశ్వరం నీళ్లు రహీంఖాన్‌పేట సింగరాయ చెరువులోకి ఫీడర్ చానల్ కాలువ ద్వారా చెరువులోకి చేరుతున్నాయి. అక్కడి నుంచి నారెడ్డిపల్లి జాలకుంట, అక్కడి నుంచి కందికట్కూర్, పొందలపురం, రంగంపేట, వంతడుపుల చెరువుల్లోకి చేరతాయి. బిక్కవాగు ద్వారా ఇల్లంతకుంట, జంగంరెడ్డిపల్లి, అనంతారం, గాలిపల్లి, ముస్కాన్‌పేట, పొత్తూరు, జవారిపేట, గన్నేరువరం మండలం చొక్కారావుపల్లి గ్రామాల రైతులకు మేలు జరగనుంది. బిక్కవాగులో నీరు ప్రవహిస్తుండడంతో బోర్లు, బావులు భూగర్భజలాలు పెరుగుతాయి.

యాసంగికి ఢోకాలేదు...

అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఎండిపోతాయనుకున్న వరి పొలాలు చేతికొస్తాయని, ఇక యాసంగి పంటకు ఢోకాలేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్య తెలుసుకుని నీటి విడుదల చేయించిన ఎమ్మెల్యేకు, అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పంటలు ఎండొద్దనే



రైతులకు సాగునీరందించేందుకు అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం చెరువులోకి నీటిని విడుదల చేయించాం. ఇరిగేషన్ ఈఎన్‌సీతో మాట్లాడి అనంతారం చెరువు మత్తడికి గండిపెట్టించి బిక్కవాగు, రహీంఖాన్‌పేట ఫీడర్ చానల్ కాలువకు నీటిని విడుదల చేయించాం. దీంతో రైతులకు నీటిబాధలు తప్పాయి.

– రసమయి, ఎమ్మెల్యే, మానకొండూర్

బావిలో బోరువేసిన



యాసంగిలో ఐదెకరలా వరకు వరి సాగుచేసిన. చెరువులో నీళ్లులేక బావిలో నీరు అడుగంటి మ డి తడారిపోయింది. రూ.70 వేలు ఖర్చుచేసి బావిలో బోర్‌వేసినప్పటికీ నీళ్లు కొద్దిగానే వచ్చా యి. చెరువు నింపాలని రైతులందరు ఎమ్మెల్యేకు ఫోన్ చేయడంతో నీటిని విడుదల చేయించారు. యాసంగికి ఇబ్బందులు తప్పాయి.

– మధు, రైతు,రహీంఖాన్‌పేట

రైతుల కష్టం చూడకనే



రైతులు పంటలు ఎండుతున్నాయని సమస్యను ఎమ్మెల్యే రసమయి దృష్టికి తీసుకెళ్లడంతో అదనపు టీఎంసీ పైపులైన్ పనులకు అంతరాయం కలగకుండా అనంతారం చెరువుకు ఈఎన్‌సీతో మాట్లాడి గండిపెట్టించి బిక్కవాగులోకి నీటిని విడుదల చేయించారు. రైతులకు ఇక యాసంగి పంటకు ఇబ్బందులుండవు.

– సిద్ధం వేణు, జెడ్పీ వైస్‌చైర్మన్

హద్దులు దాటి.. గుట్టలు లూటీ



గుట్టను తొలగించడంతో ఏర్పడిన భారీ గొయ్యి



అనుమతి లేనిచోట పేల్చివేసిన బండరాయి

- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన
- ప్రభుత్వ భూముల్లోని గుట్టలకు ఎసరు
- గ్రామపంచాయతీ పన్నుల ఎగవేత

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సంపాదనే లక్ష్యంగా కొంత మంది అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. చివరకు గుట్టలను సైతం మింగేస్తున్నారు.. నిబంధనలకు నీళ్ల వదులుతూ ప్రభుత్వ భూముల్లోని గుట్టలపై బండరాళ్లను రాత్రికి రాత్రి పేల్చి ఆ రాయిని క్రషర్‌కు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట, ఓబులాపూర్ శివారు సమ్మక్క ఆలయం సమీపంలో రహదారి పక్కనే ప్రభుత్వ భూమిలో గుట్టలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం క్రషర్‌కు కేటాయించిన ఏరియాలో మాత్రమే రాళ్లను తొలిచే వీలుండడంతో అక్కడ మెరుగైన రాయి లభ్యత లేకపోవడంతో దొంగచాటుగా ఇతర ప్రాంతాల్లోని గుట్టలను కొల్లగొడుతున్నారు. నిఘాపెంచాల్సిన ప్రభుత్వ అధికారులు మాత్రం ఇటువైపు చూసిన దాఖలాలు కనిపించడం లేదు.

గ్రామపంచాయతీకి పంగనామాలు..

మైనింగ్ అధికారుల నుంచి లైసెన్స్ ఉన్నప్పటికీ క్రషర్ నిర్వహించాలంటే సంబంధిత గ్రామపంచాయతీ నుంచి పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతీ సంవత్సరం కమర్షియల్ ట్యాక్స్‌ను ఆయా గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సి ఉండగా సదురు క్రషర్ యాజమాన్యం ఇప్పటివరకు గ్రామపంచాయతీకి చిల్లిగవ్వ చెల్లించిన దాఖలాలు లేవు.. ఏకంగా 2008 నుంచి దాదాపు 14 ఏళ్లుగా గ్రామపంచాయతీకి పన్నులు ఎగవేస్తూ గ్రామపంచాయతీ ఆధాయానికి గండి కొడుతున్నారు. రాళ్లపేట గ్రామ పంచాయతీ నుంచి పన్నుల వసూళ్లకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీచేశారు. 2–27 ఇంటి నంబర్‌తో ప్రతీ ఏడాది గ్రామపంచాయతీకి కేవలం రూ.283 చెల్లిస్తూ వస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రకృతి సంపదను దోచేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నోటీసులు భేఖాతరు..



రాళ్లపేట రోడ్డుకు నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్

క్రషర్ యజమానికి గ్రామపంచాయతీ నుంచి మూడుసార్లు, ఎంపీవో నుంచి ఒకసారి మొత్తంగా నాలుగు సార్లు నోటీసులు జారీచేసినప్పటికీ స్పందన లేదు.. ఇదేంటని ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నారని సర్పంచ్ వాపోతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. వారి పలుకుబడి ముందు నిలువలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మైనింగ్ అన్ని పర్మీషన్లు పొందినట్లు సదురు క్రషర్ యజమానులు చెబుతున్నప్పటికీ.. అనుమతులు పొందిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో మైనింగ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

స్పందించడం లేదు



క్రషర్ యజమానిని గ్రామపంచాయతీ పన్నులు కట్టాలని అడిగితే స్పందించడం లేదు. 2008 నుంచి అక్రమంగా క్రషర్ నిర్వహిస్తున్నారు. పర్మిషన్ పత్రాలు చూపమంటే బెదిరింపులకు పాల్పడుతున్నారు. క్రషర్‌పై తగిన చర్యలు తీసుకోవాలి.

– బాలుసాని పర్శరాములు, సర్పంచ్ రాళ్లపేట

చర్యలు తీసుకుంటాం..



రాళ్లపేట క్రషర్ నిర్వాహకులు గ్రామపంచాయతీకి పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టే విషయం ఇంతవరకు నా దృష్టికి రాలేదు. గ్రామపంచాయతీ నుంచి నాకు తెలియజేస్తే క్రషర్ నిర్వాహకులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటాం.

– పి.లచ్చాలు, ఎంపీడీవో తంగళ్లపల్లి

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..



నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారికి నిర్ధేశించిన ప్రాంతంలో మాత్రమే మైనింగ్ చేయాలి. అలాకాంకుండా ఇతర ప్రాంతాల్లో గుట్టలను తొలగిస్తే చర్యలు తీసుకుంటాం.

– పి.సదానందం, తహసీల్దార్ తంగళ్లపల్లి

విద్యార్థుల విజ్ఞానయాత్ర

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను హెచ్‌ఎం రమేశ్ ఆదివారం విజ్ఞాన, విహార యాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ... విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ, ఒత్తిడి నుంచి విముక్తి కలిగించాలని విజ్ఞాన, విహారయాత్రల కు తీసుకెళ్లామన్నారు. సిద్దిపేట జిల్లా కోమటిరెడ్డి చెరువును, రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో గ్రంథాలయాలన్ని, కొత్తచెరువు ను విద్యార్థులతో కలిసి సందర్శించారు. టీచర్లు అఖిల, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోమటిరెడ్డి చెరువు వద్ద విద్యార్థులు

పొంచి వున్న ప్రమాదం..



ముస్తాబాద్: మండలంలోని సేవాలాల్‌తండా పరిధి ధరంసోత్‌తండా ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడు గుంత ప్రమాదకరంగా ఉంది. కొన్నిరోజుల క్రితం పాఠశాల చేతిపంపు వద్ద భారీ ఇంకుడు గుంత నిర్మాణానికి పునాదులు తీశారు. దానిని అలాగే వదిలేయడంతో.. దారిలో చేతిపంపు వద్దనున్న గుంతను చూసి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే వెంటనే ఇంకుడుగుంత పనులు పూర్తిచేయాలని తండా వాసులు కోరుతున్నారు.

దండెత్తుతున్న వానర సైన్యం



తడగొండ పొలాల్లో కోతుల దండు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామంలో రైతుల పంటలపై వానర మూకలు దండెత్తాయి. ఈ క్రమంలో కోతుల దండు మూకుమ్మడిగా పొలాలపై దాడులు చేస్తుండగా పంటలు పాడైపోతున్నాయని రైతులు ఆవేదన చెందారు. ఒకేసారి వందల సంఖ్యల్లో కోతులు పొలాల్లోకి రావడంతో ఇప్పుడే ఎదుగుతున్న నారుమడి చెడిపోతుందని బుర్ర కనుకయ్య ఇతర రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేద యువతులకు పుస్తె,మెట్టెలు వితరణ



పుస్తె,మెట్టెలు అందిస్తున్న సభ్యులు

చందుర్తి: మండలకేంద్రానికి చెందిన నిరుపేద యువతి కోన సోని వివాహానికి అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆదివారం పుస్తె, మెట్టెలు వితరణగా అందించారు. సోని తండ్రి రవి నాలుగేళ్ల క్రితమే మృతిచెందగా, తల్లి వజ్రవ్వ కూలీ పనిచేసి కూతురును పెంచి, పోషించింది. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి అయ్యప్ప సేవా సమితి సభ్యులు తమవంతు సాయంగా పుస్తె,మెట్టెలు అందించారు. గురుస్వామి మేడిశెట్టి రాజు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చిలుక త్రిభువన్, రాజూరి రవీందర్, లింగాల రాజయ్య, మార్త మల్లేశం, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గుండారం గ్రామంలో ఆదివారం జజ్జరి దేవయ్య దేవవ్వ దంపతుల కూతురు వివాహానికి సిరిసిల్లకు చెందిన బీజేపీ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్ పుస్తెమెట్టెలు,పెళ్లి చీర అందించి తన ఔదర్యాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో బీజేపీ మోర్చా మండల అధ్యక్షుడు రవీందర్, గుండెల్లి వేణు, మల్లయ్య, నర్సయ్య, రాజు, మోహన్, నాగరాజు, సురేశ్, కిషన్, ట్రస్ట్ సభ్యులు సిరిసిల్ల రాజేశం,ద్యావనపల్లి రామకష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మారుమూల గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, వెంకటాపూర్ గ్రామాల్లో లూజ్‌వైర్లు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఆదివారం ప్రారంభించారు. దుమాల గ్రామశివారులోని ఆల యాల వద్ద విద్యుత్ సరఫరాకు కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను మంత్రి కేటీఆర్ సెస్ చైర్మన్ చిక్కాల రామరావు సహకారంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు కదిరే రజిత, కోల అంజమ్మ, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కదిరే భాస్కర్, నాయకులు బాలకిషన్, నరసింహరెడ్డి, బాలయ్య, ఏఈ దివ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న దేవయ్య

ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారం గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ మైనంపల్లి సతీశ్‌రావు తల్లి 10రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొడ్డు దేవయ్య పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంపునూరి మల్లేశ్‌గౌడ్, చందనగిరి గోపాల్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు పూజ భూమరాజం, ప్రధానకార్యదర్శి రావిశెట్టి నారాయణ, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ సీతానాయక్, హరిదాస్‌నగర్ మాజీ సర్పంచ్ రాజమల్లయ్య ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ....

తంగళ్లపల్లి: మండలంలోని చీర్లవంచ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన కాంగ్రెస్ కార్యకర్త తిప్పరవేని శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి పరామర్శించారు. శ్రీనివాస్ చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేకే.మహేందర్‌రెడ్డి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని), ఏరెడ్డి వెంకట్ రెడ్డి, గంగు మహేశ్, ప్రశాంత్, అరెపల్లి బాలు, బాబు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

రుద్రంగి(వేములవాడ)/ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. రుద్రంగికి చెందిన వృద్ధురాలు లక్ష్మి పోలీస్‌స్టేషన్ ఆవరణ నుంచి ఓబైక్‌పై వెనకాల కూర్చొని ఇంటికెళ్తోంది. కోరుట్ల–వేములవాడ రోడ్డు దాటుతుండగా వేములవాడ వైపు వెళ్తున్న మరో బైక్ వెనక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మి కాలు విరిగింది. వెంటనే వేములవాడలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ముస్తాబాద్‌లో కారు, బైక్ ఢీ

ముస్తాబాద్ పట్టణం వెంకయ్యకుంట వద్ద సిద్దిపేట రహదారిపై ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో రైతులు లోకం వెంకటి, పెంజర్ల పవన్ గాయపడ్డారు. పొలం పనులు ముగించుకొని బైక్‌పై వస్తుండగా సిద్దిపేట వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న వెంకటి, పవన్ గాయపడ్డారు. క్షతగాత్రులను ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

సమస్యల వలయంలో తుర్కాషినగర్



డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు

- డ్రెయినేజీ లేని తుర్కాషినగర్
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని పాలకులు

వేములవాడరూరల్: ఆదర్శ గ్రామంగా ఏకగ్రీవంగా ఏర్పడిన ఈ గ్రామ పంచాయతీ నాలుగేళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు డ్రెయినేజీ లేదు. కాలనీలో నీరంతా పారుతుంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాకాలంలో వారి కష్టాలు చెప్పనక్కర్లేదు. ఇంటి ముందు కుంటలా నీరునిలిచి ఉంటే బకెట్లతో పారబోసుకునే పరిస్థితి నెలకొంటుంది. ఇది వేములవాడరూరల్ మండలంలోని తుర్కాషినగర్‌లో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్య. ఈ గ్రామంలో జనాభా 580ఉండగా 340ఓటర్లు ఉన్నారు. ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పాటు మొత్తం 120 ఇళ్లు ఉన్నాయి. నిరుపేదలైన గ్రామస్తుల కోసం ప్రభుత్వం వేములవాడ నియోజకవర్గంలోనే మొట్టమొదటిసారిగా ఆ గ్రామానికి 40 డబుల్ బెడ్‌రూంలను ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేకంగా మంజూరు చేసి 29 ఆగస్టు 2019న అప్పటి మంత్రి ఈటల రాజేందర్ చేతులమీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కాలనీలో డ్రెయినేజీ ఏర్పాటుచేయలేదు. డబుల్ బెడ్‌రూంలు కూడా నాణ్యత లేక వర్షాకాలంలో నీటిధారలు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ మిషన్ భగీరథ నీరు రావడం లేదని అంటున్నారు.